క్లుప్తంగా

ఆకలితో అలమటిస్తున్న గోవులు

గిద్దలూరు రూరల్: అక్రమంగా తరలిస్తున్న గోవులను స్వాధీనం చేసుకుని ఇటీవల పట్టణంలోని మార్కెట్ యార్డు ఆవరణలో ఉంచిన విషయం తెలిసిందే. అక్కడ ఉన్న గోవులు ఆకలితో అలమటిస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 7వ తేదీన బీజేపీ నాయకులు పట్టణంలోని కుమ్మరాంకట్ట సెంటర్ వద్ద అక్రమంగా తరలిస్తున్న కంటైనర్ లారీ గోవులను అడ్డుకుని వాటను మార్కెట్ యార్డు ఆవరణలో ఉంచారు. అప్పటి నుంచి అక్కడే ఉన్న 89 గోవులు ఆకలికి ఇబ్బందులు పడుతున్నాయని తెలిసింది. ఆ గోవుల మందలో 2 గోవులు మరణించాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గోవులను సరైన దాణ, నీటి వసతి ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

నేడు తాడివారిపల్లిలో పశువైద్య శిబిరం

తర్లుపాడు: మండలంలోని తాడివారిపల్లిలో పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ సౌజన్యంతో పశుగర్భకోశ చికిత్స శిబిరం బుధవారం నిర్వహిస్తున్నట్లు పశువైద్యాధికారి డాక్టర్ డి.విష్ణువర్ధన్ తెలిపారు. ఎదకు రాని, తిరగకట్టే పశువులకు పరీక్షలు నిర్వహించి మందులు ఇవ్వనున్నట్లు చెప్పారు. పాడి రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఓ ప్రకటనలో కోరారు.

మీటర్ రీడర్ల కష్టాలు తొలగించాలి


డీఈ కార్యాలయంలో వినతిపత్రం అందస్తున్న మీటర్ రీడర్లు

మార్కాపురం: డివిజన్‌లో పనిచేస్తున్న మీటర్ రీడర్ల కష్టాలు తొలగించాలని అసోసియేషన్ అధ్యక్షులు ఎస్‌కే అన్వర్, పి.సతీష్ ఆధ్వర్యంలో విద్యుత్ డీఈ కార్యాలయంలో మంగళవారం వినతిపత్రం అందించారు. మీటర్ రీడర్లకు రెండు నెలలుగా వేతనం ఇవ్వడం లేదని, అలాగే గత 6 నెలల నుంచి ఈపీఎఫ్ కింద 500 నుంచి 1500 రూపాయల వరకు వసూలు చేస్తున్నారని అర్జీలో పేర్కొన్నారు. అందరికీ అరియర్స్ ఇవ్వాలని, వాటిని వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేసి రాగితీగ చోరీ


ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్

కంభం: మండలంలోని పెద్దనల్లకాల్వలో దుండగులు దుగ్గెపోగు సుగుణమ్మకు చెందిన పొలంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి అందులో ఉన్న రాగితీగను అపహరించుకెళ్లారు. పంట పొలాలకు బోర్ల ద్వారా నీరు అందించేందుకు ఏర్పాటు చేసుకున్న ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేయడంపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి


వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్సై

కొనకనమిట్ల: జాతీయ రాహదారిపై చినారికట్ల జంక్షన్‌లో మంగళవారం సాయంత్రం ఎస్సై మాధవరావు తన సిబ్బందితో వాహనాలు తనిఖీ చేశారు. సరైన ధ్రువపత్రాలు లేని వాహనదారులకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని వాహనదారులను హెచ్చరించారు. అనంతరం బస్టాండ్ సెంటర్లో ప్రజలతో మాట్లాడారు. శాంతి భద్రతలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలి


పత్తిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ జక్కం మెర్సీ

బేస్తవారిపేట: పత్తి పంటలో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించడంతో అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారి జక్కం మెర్సీ అన్నారు. మండలంలోని జేబీకే పురంలో మంగళవారం పత్తి పంట సాగు చేసిన రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పత్తి పంటలో పచ్చదోమ ఉండటాన్ని గమనించారు. దీని నివారణకు అసిటామిప్రిడ్ లేక ఇమిడాక్లోప్రిడ్ 0.2 ఎంఎల్ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కలుపు నివారణ యాజమాన్య పద్ధతులపై రైతులకు వివరించారు. వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థుల అవస్థలు

● చిన్నపాటి వర్షం కురిసినా ఎస్సీ హాస్టల్ విద్యార్థులకు ఇక్కట్లు
● నీరు కారుతున్న వంటగదిలోనే భోజనం వండాల్సిన పరిస్థితి


వర్షానికి హాస్టల్ ఎదుట నిలిచిన వర్షం నీరు

కంభం: చిన్నపాటి వర్షం కురిసినా స్థానిక రావిపాడు రోడ్డులో ఉన్న ఎస్సీ బాయ్స్ హాస్టల్లో వర్షపు నీరు నిలిచి పోతుండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుకన్నా హాస్టల్ భవనం తక్కువ ఎత్తులో ఉండటంతో వర్షం నీరంతా హాస్టల్లో వెళ్లిపోతుంది. భవనం ముందు ఆవరణలో, హాస్టల్ లోపల బాత్‌రూమ్స్ ఎదురుగా వర్షం నీరు నిలిచిపోతుంది. వర్షం వస్తే వంటగది కారుతుండటంతో వంట చేసుకోవడాని ఇబ్బందులు పడుతున్నారు. 50 ఏళ్ల క్రితం నిర్మించిన భవనం కావడంతో పలు గదులు శిథిలావస్థకు చేరుతున్నాయి. హాస్టల్లో పూర్తి స్థాయిలో వసతులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం విషజ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో హాస్టల్లో పరిసరాలు వర్షం నీరు నిలిచిపోయి హాస్టల్ ప్రాంగణం అధ్వానంగా మారిపోతుండటంతో పిల్లలకు జ్వరాలు వచ్చే అవకాశం ఉందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. హాస్టల్లో డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసి పిల్లలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నారు.


బాత్‌రూమ్స్ ముందు నిలిచిన నీరు


కారుతున్న వంట గదిలోనే వండుతున్న భోజనం

పగిలిన మంచినీటి పైపులైన్


పైపులైన్ పగలడంతో బురదగా మారిన రోడ్డు

బేస్తవారిపేట: స్థానిక రెడ్డినగర్‌లో పది రోజుల క్రితం మంచి నీటి పైపులైన్ పగిలింది. రోడ్డు పక్కన చప్టా ముందు భాగంలో పైపులైన్ పగిలి రోడ్డుపైకి నీరు చేరుతోంది. నివాస గృహాల ముందు నుంచి నీరు మెయిన్ రోడ్డుపైకి చేరుతుండటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది. వాహనాల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉండే రోడ్డుపై నీరు చేరుతుండటంతో మురికి కూపంగా మారుతుంది. పంచాయతీ అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని రెడ్డినగర్ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చెత్త నుంచి సంపద ఇదేనా?


రాచర్లలో రోడ్డులో వ్యర్థాలు వేయడంతో సంచరిస్తున్న పందులు


ఆకవీడు ఎస్సీ కాలనీకి వెళ్లే మార్గంలో చెత్తా చెదారం


చోళ్లవీడులో దుర్వాసన వెదజల్లుతున్న వ్యర్థాలు

● రోడ్ల పక్కన చెత్త, ఇతర వ్యర్థాలు

రాచర్ల: చెత్త సేకరణ లక్ష్యం నీరుగారుతోంది. గ్రామాల నుంచి చెత్తను సేకరించి నేరుగా చెత్త సేకరణ కేంద్రాలకు (డంపింగ్ యార్డ్) తరలించి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలన్నా నిర్ణయం అమలు కావడం లేదు. చెత్త సేకరణ కోసం గ్రామాల్లో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డ్‌లు వినియోగంలోకి రావడం లేదు. రాచర్ల పంచాయతీ పరిధి అకవీడు, రాచర్ల, చోళ్లవీడు గ్రామాల్లో చెత్త ఎక్కడికక్కడ పేరుకుపోతోంది. రాచర్లల్లో డంపింగ్ యార్డు ఉన్నా నేటికీ వినియోగంలోకి తీసుకురాలేదు. గ్రామాల్లోని చెత్తను రోడ్ల పక్కన ఎక్కడిబడితే అక్కడే పడేస్తున్నారు. రాచర్ల సమీపంలోని వెలిగొండ ప్రాజెక్టు పైపులైనులో, రోడ్డు పక్కన చెత్త వేయడంతో పందులు, కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. వ్యర్థాల కోసం వచ్చే పందులు రోడ్డుకు అటు ఇటు తిరగడంతో చిన్న, చిన్న రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆకవీడులో ఎస్సీ కాలనీకి వెళ్లే దారిలో ఇష్టానుసారంగా రోడ్లపై, వీధుల్లో చెత్త వేయడంతో పెద్ద పెద్ద గాలులకు మళ్లీ చెత్తాంత నివాస గృహాల్లోకి చెరుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చోళ్లవీడు గ్రామంలో బస్‌స్టాండ్ సమీపంలో చెత్త వేయడంతో ఆ చెత్త కుళ్లి దుర్వాసన వస్తోందని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని చెత్తను డంపింగ్ యార్డులకు తరలించాలని స్థానికులు కోరుతున్నారు.


రాచర్లలో వెలిగొండ ప్రాజెక్టు పైపులైనులో పడేస్తున్న చెత్త

చింతగుంట్లలో పశువైద్య శిబిరం


మాట్లాడుతున్న డాక్టర్ యోగానంద ప్రసాద్, పక్కన పశువైద్యాధికారులు

మార్కాపురం రూరల్: మండలంలోని చింతగుంట్ల గ్రామంలో పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ సౌజన్యంతో మంగళవారం పశుగర్భకోశ చికిత్స శిబిరం నిర్వహించారు. పశువైద్యాధికారి డాక్టర్ యోగానంద ప్రసాద్ మాట్లాడుతూ.. ఎదకురాని గేదెలను చూలుకట్టేలా చేసి ఏడాదికొక దూడ ఎలా పొందాలి, దూడల సంరక్షణపై పాడి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. గాలికుంటు వ్యాధి సోకకుండా పశువులకు టీకాలు వేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఈఓ డాక్టర్ రవికుమార్, మార్కాపురం సహాయ సంచాలకులు డాక్టర్ బాలూ నాయక్, కొండేపల్లి, గజ్జలకొండ, తర్లుపాడు, కలుజువ్వలపాడు పశువైద్యాధికారులు డాక్టర్ లీనా గ్రేస్, డాక్టర్ అశోక్‌కుమార్, డాక్టర్ నందన, డాక్టర్ సౌజన్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం పాడి రైతులకు మందులు పంపిణీ చేశారు.

గ్రామసభల బాధ్యత పంచాయతీ కార్యదర్శులదే


మాట్లాడుతున్న డీఎల్‌డీఓ సాయికుమార్

మార్కాపురం రూరల్: ఈనెల 23న రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రత్యేక గ్రామ సభలను పంచాయతీ కార్యదర్శులు బాధ్యతతో నిర్వహించాలని డీఎల్‌డీఓ సాయికుమార్ పేర్కొన్నారు. సోమవారం మార్కాపురం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 23వ తేదీన మండలంలో చేపట్టాల్సిన పనులపై చర్చించి తీర్మానాలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ తోట చందన, ఈఓఆర్‌డీ రామ్మోహన్‌రెడ్డి, పీఆర్ ఏఈ మోహన్‌రాజ్, పంచాయితీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, పశుసంవర్ధక శాఖ అధికారులు, సహాయకులు పాల్గొన్నారు.

100 రోజుల్లో గృహ నిర్మాణాలకు కార్యాచరణ

కార్యాచరణ ప్రణాళికల్లో భాగంగా గృహ నిర్మాణాలపై ఎంపీడీఓ సమీక్ష నిర్వహించారు. వీలైనంత త్వరగా ఇళ్లను పూర్తిచేయాలని ఆదేశించారు. లేఅవుట్లపై వివరణాత్మక సమీక్ష, ఇసుక ఆవశ్యకత, ఆర్థిక సమస్యలతోపాటు పలు అంశాలపై చర్చించారు.

పీహెచ్‌సీ వైద్యాధికారికి సన్మానం


వైద్యాధికారిని సన్మానిస్తున్న నారాయణరెడ్డి

బేస్తవారిపేట: మండలంలోని గలిజేరుగుళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారి లక్ష్మీజలేంద్రను ఆర్ట్ ఆఫ్ లివింగ్ గురుకు, సంఘ సేవకులు బీఎస్ నారాయణరెడ్డి మంగళవారం శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. గలిజేరుగుళ్ల మారుమూల ప్రాంతంలో నివాసముంటూ, 24 గంటలు అందుబాటులో ఉండి ప్రజలకు వైద్యసేవలను డాక్టర్ లక్ష్మీజలేంద్ర అందించడం ఎంతో సంతోషదాయకమన్నారు. వైద్యశాల ఆవరణలో మొక్కలు నాటారు. డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ కేపీ గురవయ్య, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యురాలిపై హత్యాచారాన్ని నిరసిస్తూ ర్యాలీ


కంభంలో మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు


మార్కాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న జార్జి కళాశాల విద్యార్థులు

మార్కాపురం: కోల్‌కతాలోని ఆర్.జి.కార్ ఆస్పత్రిలో విధి నిర్వహణలో ఉన్న వైద్యురాలిపై హత్యాచారానికి నిరసనగా మంగళవారం స్థానిక జార్జి ఫార్మసీ కళాశాల విద్యార్థులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. నిందితులను కఠినంగా శిక్షించాలని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు సంభవించకుండా మహిళలకు రక్షణ కల్పించాలని కోరారు. స్త్రీలను ఎలా గౌరవించాలో తమ పిల్లలకు తలిదండ్రులు నేర్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వై రాజారావు, హెచ్ఓడీ సునీత, సీఓ డాక్టర్ అశోక్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో..

బీజేపీ ఆధ్వర్యంలో ముస్లిం మైనార్టీ మోర్చా ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. నిందితులకు ఉరిశిక్ష వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసెంబ్లీ ఇన్‌చార్జి పీవీ కృష్ణారావు, షబానా, రామకృష్ణ, రాజ శ్రీకాంత్, సుబ్బారావు, వాసవీ ప్రియ, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కంభంలో విద్యార్థుల ర్యాలీ

కంభం: కోల్‌కతాలో మెడికల్ కళాశాల విద్యార్థినిపై జరిగిన ఘాతుకానికి నిరసనగా మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు, క్రిష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కందులాపురం సెంటర్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. విద్యార్థినీ, విద్యార్థులు ప్లకార్డులు చేతపట్టి నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాసరావు, అధ్యాపకులు రంజిత్ కుమార్, యలమంద, గురుశేఖర్, జిలాని, జయశ్రీ, సురేష్‌కుమార్, కృష్ణవేణి స్కూల్ ప్రిన్సిపాల్ రాజశేఖర్, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో విద్యార్థులకు శాశ్వత సభ్యత్వం


సభ్యత్వం అందజేస్తున్న ఆదిలక్ష్మి

పొదిలి: స్థానిక గ్రంథాలయంలో మంగళవారం గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి చేతుల మీదుగా విద్యార్థులకు శాశ్వత సభ్యత్వ కార్డులు అందజేశారు. రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ పేరయ్య పది మంది విద్యార్థులకు తన సొంత డబ్బులతో సభ్యత్వం ఇప్పించారు. ప్రతి విద్యార్థి గ్రంథాలయంలో సభ్యత్వం పొంది, ఉపయోగించుకోవాలని ఆయన కోరారు. గ్రంథ పాలకుడు శ్యాంసన్ మాట్లాడుతూ.. గ్రంథాలయంలోని పుస్తకాలను ఉపయోగించుకుని విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో హుస్సేన్ పాషా, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈ క్రాప్‌తో రైతులకు ప్రయోజనం

తర్లుపాడు: ఖరీఫ్ సీజన్‌లో మండలంలోని రైతులు సాగు చేసిన పంటల వివరాలు ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని ఏఓ వెంకటేశ్వర్లు సూచించారు. రైతులు ఆధార్ కార్డు, 1బీ, పాస్‌బుక్ జిరాక్స్, మొబైల్ నంబర్‌తో సచివాలయంలో అగ్రికల్చర్ అసిస్టెంట్లను సంప్రదించాలని చెప్పారు. కచ్చితంగా పంట వేసిన పొలాలకే ఈ క్రాప్ నమోదు చేస్తామని ఓ ప్రకటనలో స్పష్టం చేశారు.

కేజీబీవీ తనిఖీ


ట్యాబ్ బేస్డ్ పరీక్షను పరిశీలిస్తున్న ఎంఈఓ వెంకటరత్నం

కొమరోలు: మండలంలోని రాజుపాలెం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని మంగళవారం మండల విద్యాశాఖాధికారి బొర్రా వెంకటరత్నం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 10వ తరగతి విద్యార్థులకు సీబీఎస్‌సీ సిలబస్‌లోని ట్యాబ్ బేస్డ్ అసైన్‌మెంట్ ద్వారా నిర్వహిస్తున్న పరీక్షను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓ వెంకటరత్నం మాట్లాడుతూ జిల్లాలో ట్యాబ్ బేస్డ్ అసైన్‌మెంట్ 63 పాఠశాలల్లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అందులో భాగంగా ఈ పరీక్షను ఈ పాఠశాలలో నిర్వహించామన్నారు. వీరివెంటస్పెషల్ ఆఫీసర్ రోజ్‌సులోచన పాల్గొన్నారు.

డీఎస్పీని కలిసిన దళిత సంఘాల నాయకులు


డీఎస్పీని సత్కరిస్తున్న దళిత సంఘాల నాయకులు

పొదిలి: పొదిలి మండల ఎంఆర్‌పీఎస్ నాయకులు, పలు దళిత సంఘాల నాయకులు మంగళవారం దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణను మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను సత్వరమే విచారణ చేయించాలని కోరగా డీఎస్పీ సానుకూలంగా స్పందించారని ఎంఆర్పీఎస్ మండల అధ్యక్షుడు పేర్కొన్నారు. డీఎస్పీని కలిసిన వారిలో సంఘ నాయకులు వేల్పుల నెహేమియా బాబు, రాష్ట్ర దళిత సేన దర్శి నియోజకవర్గ అధ్యక్షుడు జి.ప్రేమ్‌కుమార్, వేల్పుల ఎలిషా, జి.అహరోన్, జి.జాన్, ఆంథోని తదితరులు ఉన్నారు.

బాధ్యతలు చేపట్టిన ఎస్‌ఐ అనిల్‌కుమార్

పెద్దారవీడు: పెద్దారవీడు పోలీసుస్టేషన్‌లో నూతన ఎస్‌ఐ అనిల్‌కుమార్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఎస్‌ఐ మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలకు ఎలాంటి ఆటంకం కలిగించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్‌ఐకి పోలీసులు అభినందనలు తెలిపారు.

కళాశాలలో ఆర్ట్ ఎగ్జిబిషన్


సన్మాన గ్రహీతలతో ఆర్‌ఐ, అధ్యాపకులు

కంభం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ప్రగతి ఆర్టిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్ట్ క్యాంప్, ఎగ్జిబిషన్ నిర్వహించారు. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన చిత్రకారులు వేసిన చిత్రాలను ప్రదర్శనకు ఉంచగా విద్యార్థులు తిలకించారు. కళాశాల ప్రహరీపై జాతీయ నాయకుల చిత్రాలు వేశారు. అనంతరం కళాకారులను కళాశాల అధ్యాపకులు సన్మానించారు. ఆర్‌ఐఓ సైమన్ విక్టర్, పీడీ మురళి, చిత్రకారులు ఖాసిం, రాజు, కోటి పాల్గొన్నారు.

నేతపాలెంలో వైద్య శిబిరం

పొదిలి: స్థానిక నేతపాలెంలో సీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ శరత్ చంద్ర రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వర్షాకాలం కావడంతో సీజనల్ జ్వరాలు ప్రబలుతున్నాయని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. రక్తనమూనాలు సేకరించిన అనంతరం అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ సుప్రజ, ఎల్‌టీ పరశురామ్, ఏఎన్‌ఎంలు విజయ, రాణి, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కేజీబీవీలో సీబీఎస్ఈ బేస్‌లైన్ ట్రైల్ పరీక్షలు


కేజీబీవీలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, జెడ్పీ ఉన్నత పాఠశాల, వెలుగొండ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు మంగళవారం సీబీఎస్ఈ బేస్‌లైన్ ట్రైల్ పరీక్షలు సమర్థవంతంగా నిర్వహించారు. కేజీబీవీ ప్రిన్సిపాల్ రాఘవ సురేఖ, జెడ్పీ పాఠశాల హెచ్ఎం విజయలక్ష్మి, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరావు పర్యవేక్షణలో విద్యార్థులు తమ ట్యాబ్‌లలో పరీక్షలు నిర్వహించి, వారికి సీబీఎస్ఈ విధానంపై అవగాహన కల్పించారు.

విద్యార్థులకు ఆట వస్తువుల పంపిణీ

ముండ్లమూరు: స్థానిక ఆదర్శ పాఠశాలలో క్రీడాకారులకు ఐఈఈఆర్‌డీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఐదు వేల రూపాయల విలువైన క్రీడా వస్తువులను మంగళవారం పంపిణీ చేశారు. స్వచ్ఛంద సంస్థ సహకారంతో ఎస్ఆర్ఐ ఎం.సంగీత, కుటుంబ సభ్యులు విద్యార్థులకు పలు రకాల క్రీడా వస్తువులు అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు కిరణ్‌చంద్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ప్రిన్సిపాల్ కె.పూర్ణచంద్రరావు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులను అభినందించారు.